సాక్షి
ఖమ్మం

బుధవారం । 30 । ఆగస్టు । 2023



## .. సత్తా చాటుదాం

వచ్చే ఎన్నికల్లో కమ్యూనిస్టుల సత్తా చాటేలా కార్యకర్తలు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని పిలుపునిచ్చారు. 10లో



## రెగ్యులర్ ఈఓగా రమాదేవి

భద్రాచలంలోని రామాలయం ఇన్‌చార్జ్‌గా ఈఓగా కొనసాగుతున్న రమాదేవి రెగ్యులర్ ఈఓగా బాధ్యతలు స్వీకరించారు. 10లో

గరిష్టం / కనిష్టం
35° / 24°

## వాతావరణం

జిల్లాలో బుధవారం ఉదయం నుంచే ఎండల ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నానికి మరింత పెరుగుతుంది.

## న్యూస్‌రీల్

### జిల్లా ఆస్పత్రికి 'నియోనాటల్ కేర్' అంబులెన్స్




నియోనాటల్ కేర్ అంబులెన్స్

**ఖమ్మం వైద్యవిభాగం:** జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి నియోనాటల్(నవజాతశిశువు) కేర్ అంబులెన్స్‌ను ప్రభుత్వం కేటాయించింది. ఈ వాహనం ద్వారా అనారోగ్యంతో బాధపడే శిశువులను హైదరాబాద్, తదితర పట్టణాలకు తరలించి మెరుగైన చికిత్స అందించేందుకు వీలవుతుంది. జిల్లాలోని వివిధ సీహెచ్‌సీల్లో పుట్టిన బిడ్డలతో పాటు జిల్లా ఆస్పత్రి ఎంసీహెచ్‌లో జన్మించే శిశువులకు ఆరోగ్య సమస్యలు ఎదురైతే అంబులెన్స్ ద్వారా హైదరాబాద్‌లోని నీలోఫర్ తదితర ఆస్పత్రికి తరలించాల్సి వస్తోంది. దీంతో మార్గమధ్యలో ఇబ్బంది తలెత్తకుండా వార్మర్, ఇంక్యుబేటర్, ఆక్సిజన్ తదితర అత్యాధునిక సౌకర్యాలు కలిగిన అంబులెన్స్‌ను ఆస్పత్రికి కేటాయించడంతో ఇబ్బందులు తీరినట్లయింది.

### జలవనరుల శాఖ సీఈగా విద్యాసాగర్

- ఈఎన్‌సీలో రిపోర్ట్ చేయాలని శంకర్‌నాయక్‌కు ఉత్తర్వులు



బాధ్యతలు స్వీకరిస్తున్న విద్యాసాగర్

**ఖమ్మంఅర్బన్:** జిల్లా జలవనరుల శాఖ సీఈగా విద్యాసాగర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం సీఈగా ఉన్న గుగులోత్ శంకర్‌నాయక్‌ను ఈఎన్‌సీలో రిపోర్ట్ చేయాలని సూచించడంతో పాటు ఈఎన్‌సీలో ఉన్న విద్యాసాగర్‌ను ఖమ్మంకు కేటాయిస్తూ సోమవారం రాత్రి శాఖ చీఫ్ సెక్రటరీ రజిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా, సీఈ శంకర్‌నాయక్ తల్లి ఇటీవల మృతి చెందగా ఆయన సెలవులో ఉన్న సమయాన బదిలీ చేయడం శాఖలో చర్చనీయాంశంగా మారింది. విద్యాసాగర్‌రావు ఖమ్మంలో ఐడీసీలో ఈఈగా సుదీర్ఘకాలం పని చేయగా, పదోన్నతిపై హైదరాబాద్ వెళ్లారు. మళ్లీ సీఈగా బాధ్యతలు చేపట్టగా అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.


### ప్రమాణాలు పెంచేందుకే 'ఉన్నతి'



మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

**ఖమ్మం సహకారనగర్:** ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో ప్రమాణాలు పెంచేందుకు రాష్ట్రప్రభుత్వం ఉన్నతి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ వెల్లడించారు. నగరంలోని రిక్కాబజార్ హైస్కూల్, బల్లేపల్లిలోని ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్, శాంతినగర్ ఉన్నత పాఠశాల, మౌంట్‌ఫోర్ట్ హైస్కూళ్లలో ఉపాధ్యాయులకు ఖమ్మం డివిజన్ స్థాయి శిక్షణను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో 391మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం అర్బన్ ఎంఈఓ ఎం.శ్రీనివాస్, కోర్సు కోఆర్డినేటర్ కె.వెంకటేశ్వర్లుతో పాటు రిసోర్స్ పర్సన్లు పి.ప్రభాకర్‌రెడ్డి, డి.డాన్‌బాస్కో, ఆర్.మాధవి, విష్ణువర్ధన్‌రెడ్డి, బి.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

### ఎక్కడా లీకేజీలు ఉండొద్దు



నీటి సరఫరాపై సమీక్షిస్తున్న సీఈ శ్రీనివాసరావు

**ఖమ్మంఅర్బన్:** జిల్లాలో అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా లీకేజీలు లేకుండా పర్యవేక్షిస్తూ తాగునీరు సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ శ్రీనివాసరావు సూచించారు. ఖమ్మంలోని కార్యాలయంలో ఆయన మంగళవారం నియోజకవర్గాల వారీగా అధికారులతో నీటి సరఫరా తీరుపై సమీక్షించారు. ఎప్పటికప్పుడు నీటి నమూనాలు సేకరించి పరీక్షించాలని, క్లోరినేషన్ చేస్తూ ట్యాంకులను శుభ్రం చేయించాలని తెలిపారు. ఎస్ఈ సదాశివకుమార్‌తో పాటు ఈఈలు, డీఈలు, ఏఈ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో హైరానా!



- తెరపైకి కమ్యూనిస్టుల పొత్తు అంశం
- కొత్తగూడెంపై సీపీఐ.. పాలేరుపై సీపీఎం గురి
- 'హస్తం' ఆశావహుల్లో మొదలైన టెన్షన్

**సాక్షిప్రతినిధి, ఖమ్మం:** ఉభయ కమ్యూనిస్టులతో కాంగ్రెస్ పొత్తు అంశం.. ఉమ్మడి జిల్లాలో టికెట్లు ఆశిస్తున్న వారిలో టెన్షన్ పుట్టిస్తోంది. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేతో ఇటీవల సీపీఐ నేతలు ఒక దఫా చర్చలు జరిపారు. కలిసొచ్చే వారితో పోటీ చేస్తామని సీపీఎం నేతలు సైతం ప్రకటించిన నేపథ్యాన అదే జరిగితే తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళన కాంగ్రెస్ నుంచి టికెట్లు ఆశిస్తున్న వారిలో నెలకొంది. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో ఉభయ కమ్యూనిస్టులకు కొంత బలం ఉండడం.. సీపీఐ కొత్తగూడెం, సీపీఎం పాలేరు సీటును ఆశిస్తుండటంతో అసలేం జరుగుతుందోనని ఆరా తీసే పనిలో నిమగ్నమయ్యారు.

**ఆశావహుల సంఖ్య ఎక్కువే...**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నుంచి టికెట్లు ఆశిస్తున్న వారి సంఖ్య అధికంగానే ఉంది. ఒక్కో నియోజకవర్గంలో ఇద్దరి నుంచి ఆపైనే దరఖాస్తు చేసుకున్నారు. సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి అనుచరులతోపాటు మరికొందరు టికెట్లు ఆశిస్తున్నారు. మధిర తప్ప మిగిలిన అన్ని స్థానాల్లో టికెట్ కోసం బహుముఖ పోటీ నెలకొంది. పలుస్థాయిల్లో వడపోత అనంతరమే టికెట్లు ఇస్తామని టీపీసీసీ వర్గాలు చెబుతున్నాయి.

**కాంగ్రెస్ – సీపీఐ చర్చలు**

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఠాక్రేతో హైదరాబాద్‌లో సీపీఐ నాయకులు చర్చలు జరిపారు. కొత్తగూడెం, మునుగోడు, హుస్నాబాద్, బెల్లంపల్లి స్థానాల్లో తాము బరిలో ఉంటామని ప్రతిపాదించినట్లు తెలిసింది. అయితే ఈ విషయాన్ని కాంగ్రెస్ ఇంకా తేల్చలేదు. కానీ చర్చలు జరిగాయనే సమాచారంతో ఉమ్మడి జిల్లాలోని టికెట్ ఆశిస్తున్న కాంగ్రెస్ నేతల్లో ఆందోళన మొదలైంది. ఒకవైపు పార్టీలోనే టికెట్ల కోసం యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఉండగా.. పొత్తుతో అసలుకే ఎసరు వస్తుందనే భయం వారిని వేధిస్తోంది. ఉభయ కమ్యూనిస్టు పార్టీల రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు ఉమ్మడి ఖమ్మం జిల్లా వాసులు కావడమే కాక రాష్ట్రవ్యాప్తంగా చూస్తే పార్టీపరంగా ఇక్కడే పట్టు ఉంది. ఇప్పటికే కాంగ్రెస్‌తో జరిపిన చర్చల్లో సీపీఐ నేతలు కొత్తగూడెం టికెట్ అడిగిన విషయం తెలిసిందే.

**సీపీఎం ఆచితూచి..**

కాంగ్రెస్‌తో సీపీఐ ఒక దఫా చర్చలు జరపగా.. సీపీఎం మాత్రం వేచి చూసే ధోరణితో ఉన్నట్లు తెలుస్తోంది. పొత్తులపై తొందర పడకుండా సీట్ల సంఖ్య తేలాకే మాట్లాడాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇటీవల తమ్మినేని మాట్లాడుతూ తమతో కలిసొచ్చే వారితో పోటీ చేస్తామని మాత్రం చెప్పారు. ఈనేపథ్యాన కాంగ్రెస్సే అడుగు ముందుకేసి ఈ రెండు పార్టీలతో చర్చిస్తే సీపీఐ కొత్తగూడెం, సీపీఎం పాలేరు సీటు కోసం పట్టుపడతాయని తెలుస్తోంది. అయితే, ఉభయ కమ్యూనిస్టులు అడిగే సీట్లను కాంగ్రెస్ కేటాయిస్తుందా, మధ్యేమార్గంగా ఇతర సీట్లు ఇస్తామని చెబుతుందా.. దీనికి కమ్యూనిస్టులు ఒప్పుకుంటారా.. అనే ఉత్కంఠ అటు కాంగ్రెస్ నేతలతో పాటు ఇటు కమ్యూనిస్టుల్లోనూ కొనసాగుతోంది.

**ఇదే హాట్‌టాపిక్**

ఇప్పటికే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ అభ్యర్థులు ఖరారయ్యారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థులుగా ఎవరు పోటీకి దిగుతారు, కమ్యూనిస్టులతో పొత్తు ఉంటుందా అనే అంశంపై చర్చ జరుగుతోంది. ఒకవేళ పొత్తు కుదిరితే కమ్యూనిస్టులకు ఏయే సీట్లు కేటాయిస్తారనే అంశంపై ఆసక్తి నెలకొంది. ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఆశావహులు మాత్రం తామే పోటీలో ఉంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాగా, చర్చల అంశం తేలడానికి కొంత సమయం పట్టే అవకాశమున్న నేపథ్యాన... ఆశావహులు టికెట్ల వేటలో నిమగ్నమయ్యారు.

# నిర్విరామ శ్రమతో కాపాడాం



ముంపు బాధితులకు వస్తువులు పంపిణీ చేస్తున్న మంత్రి పువ్వాడ, పక్కన కలెక్టర్ గౌతమ్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ తదితరులు

- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- మున్నేరు ముంపు బాధితులకు గృహోపకరణాల పంపిణీ

**ఖమ్మంమయూరిసెంటర్:** మున్నేరు వరదల సమయాన నిర్విరామంగా శ్రమించి ప్రతి ఒక్కరినీ కాపాడామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. ఖమ్మంలోని నయాబజార్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మున్నేరు వరద బాధితులకు ఐటీసీ సహకారంతో గృహోపకరణాలను మంత్రి పంపిణీ చేసి మాట్లాడారు. మునుపెన్నడూ చూడని స్థాయిలో వరద రాగా కంటిమీద కునుకు లేకుండా సహాయక చర్యలు చేపట్టామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఎన్డీఆర్ఎఫ్ బందాన్ని తీసుకొచ్చామని తెలిపారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి బాధితులకు ఇబ్బంది పడకుండా చేశామని పేర్కొన్న మంత్రి.. ఇప్పటికే పువ్వాడ ఫౌండేషన్ అధ్వర్యంలో ప్రతీ ఇంటికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశామని తెలిపారు.

**రిటైనింగ్ వాల్‌కు ప్రతిపాదనలు**

మున్నేరు ముంపు సమస్యను సీఎం కేసీఆర్‌కు వివరించగా ఆర్‌సీసీ రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం రూ.150 కోట్లు మంజూరు చేశారని పువ్వాడ తెలిపారు. త్వరలోనే నిర్మించేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. అలాగే, రూ.30 కోట్లతో పద్మావతి నగర్ రంగనాయకులగుట్ట, ప్రకాష్‌నగర్ వద్ద చెక్‌డ్యాంల నిర్మిస్తామని తెలిపారు. అంతేకాకుండా మున్నేరుపై రూ.180 కోట్లతో కొత్త బ్రిడ్జి నిర్మించనున్నట్లు చెప్పారు. కాగా, బాధితుల పరిస్థితిని వివరించగానే రూ.కోటి విలువైన గృహోపకరణాలు సమకూర్చిన ఐటీసీ సీఈఓ కులకర్ణికి మంత్రి తెలిపారు. త్వరలోనే రూ.1.50 కోట్ల నగదు పంపిణీకి ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఖమ్మం అర్బన్ పరిధిలో 1,893, ఖమ్మం రూరల్‌లో 571 మందికి గృహోపకరణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ కుటుంబానికి వస్తువుల పంపిణీ ఉంటుందని, ఆందోళన చెందొద్దని సూచించారు. మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి, ఆర్డీఓ గణేష్, ఐటీసీ అధికారి చెంగలరావు, తహసీల్దార్లు స్వామి, రామకృష్ణ, కార్పొరేటర్లు కమర్తపు మురళి, మాటేటి లక్ష్మీనాగేశ్వరరావు, కన్నం వైష్ణవిప్రసన్న, తోట గోవిందమ్మ రామారావు, దండా జ్యోతిరెడ్డి, నాయకులు గుండాల కృష్ణ, పగడాల నాగరాజు పాల్గొన్నారు.



కళాకారులతో కలిసి నృత్యం చేస్తున్న పువ్వాడ

**'సాంస్కృతిక సారథి' హర్షం**

తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై కళాకారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ అజయ్‌తో కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మంత్రి వారితో కలిసి నృత్యం చేశారు. ఈకార్యక్రమంలో పాగి వెంకన్న, పమ్మి రవి, సుధాకర్, బమ్మెర ముత్యం, కె.జాన్, బీరెల్లి రమణ, యంగల కుమారి, గోవింద, గురవయ్య, ఏ.కృపానందం, కె.రమేష్, హుస్సేన్, మాచర్ల కృష్ణ, మేడ ముత్తయ్య, బి.రవి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## బోదకాలు నివారణపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ మాలతి

**ఖమ్మం వైద్యవిభాగం:** జిల్లాలో బోదకాలు వ్యాధి నివారణకు మెప్మా, వైద్య సిబ్బంది కృషిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మాలతి సూచించారు. జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం మెప్మా, ఆర్పీ, నర్సింగ్ విద్యార్థులకు బోదకాలు నివారణ మాత్రల పంపిణీపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ పట్టణ ప్రాంతంలో మాత్రలు వేసుకోని వారికి వయస్సు, ఎత్తు ఆధారంగా పంపిణీ చేయాలని తెలిపారు. భవిష్యత్‌లో బోదకాలు వ్యాధి రాకుండా తప్పక మాత్రలు మింగాలనే అంశంపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఈసమావేశంలో మాతా శిశు సంక్షేమ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సైదులు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ, మెప్మా మేనేజర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## బీఎల్ఓలకు కిట్లు వచ్చేశాయ్...




ఎన్నికల సంఘం అందించిన కిట్

**నేలకొండపల్లి:** అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లను ఎన్నికల సంఘం శరవేగంగా చేస్తోంది. ఇప్పటికే ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేయగా కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులపై దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇందులో భాగంగా బూత్ లెవల్ అధికారుల(బీఎల్ఓ)కు ఎన్నికలకు సంబంధించి కిట్లను ఎన్నికల సంఘం అందజేసింది. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో మొత్తం 1,439 బూత్‌లెవల్ అధికారులకు కిట్లను మంగళవారం అధికారులు అందజేశారు. బ్యాగ్‌తో కూడిన ఈ కిట్లలో ఓటరు జాబితా సవరణ సందర్భంగా ఉపయోగపడేలా పెన్నులు సహా ఇతర సామగ్రి ఉన్నాయి.

## తగ్గిన గ్యాస్ ధరలు !

ఆనందంలో వినియోగదారులు



**ఖమ్మం సహకారనగర్:** గ్యాస్ సిలిండర్ ధరలు ఎన్నడూ పెరగడమే మనకు తెలుసు! కానీ ఈసారి కేంద్రప్రభుత్వం ధర తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈమేరకు వినియోగదారులకు ఊరట కలిగినట్లవుతోంది. గృహ వినియోగ సిలిండర్ ధర రూ.200 తగ్గించగా.. ఉజ్వల కనెక్షన్లపై రూ.400 తగ్గించారు. జిల్లాలో 4,10,404 గ్యాస్ కనెక్షన్లు ఉండగా... వీటిలో సింగిల్ సిలిండర్ కనెక్షన్లు 2,01,640, డబుల్ సిలిండర్లు 78,023, దీపం పథకం 59,742, సీఎస్ఆర్ పథకం కింద 23,688, ఉజ్వల పథకం కనెక్షన్లు 47,311 ఉన్నాయి. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.1,134 కాగా, సాధారణ కనెక్షన్లపై రూ.934కు, ఉజ్వల కనెక్షన్లపై రూ.734కు అందనుంది. అయితే, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ధరల్లో కొద్దోగొప్ప మార్పులు ఉండే అవకాశముంది.

## 75,778 మంది రైతులు.. రూ.374 కోట్లు

జిల్లాలో రుణమాఫీపై బ్యాంకర్లతో సమీక్ష



రుణమాఫీపై బ్యాంకర్లతో చర్చిస్తున్న డీఏఓ సరిత

**ఖమ్మంవ్యవసాయం:** రైతులు తీసుకున్న పంట రుణాల మాఫీ ప్రక్రియ కొనసాగుతోంది. ఈమేరకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం బ్యాంకర్లతో సమీక్షించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సరిత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈసందర్భంగా బ్యాంకుల వారీగా రుణమాఫీ ప్రక్రియపై చర్చించారు. ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.99,999 వరకు రుణమాఫీ ప్రకటించి విడుతల వారీగా నిధులు విడుదలచేస్తోంది. జిల్లాలో మొత్తం 3,41,024 మంది రైతులు 2,572 కోట్ల మేర పంట రుణాలు తీసుకోగా, ఇప్పటి వరకు 75,778 మంది రైతులకు సంబంధించి రూ.374 కోట్లు మాఫీ అయ్యాయని అధికారులు తెలిపారు. ఇంకా 23,137 మంది రైతులకు రూ.263 కోట్లు జమ అయ్యే ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. అయితే, డీసీసీబీ పరిధిలో పెద్ద మొత్తంలో రుణాలు మాఫీ కావాల్సి ఉండడం, కొన్ని సొసైటీలు జాబితాలో లేని అంశం కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చింది. దీంతో సదరు బ్యాంకు అధికారి మాట్లాడుతూ టెస్కాబ్ ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లినందున త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు.

# పోటాపోటీగా దరఖాస్తులు

- కాంగ్రెస్ నుంచి 120 మంది దరఖాస్తు
- అత్యధికంగా ఇల్లెందులో 32 మంది..
- మధిర నియోజకవర్గం నుంచి ఇద్దరే



**సాక్షిప్రతినిధి, ఖమ్మం:** వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా దరఖాస్తు చేసుకున్న ఆశావహుల జాబితాను టీపీసీసీ వెల్లడించింది. ఈమేరకు మంగళవారం టీపీసీసీ ఎన్నికల కమిటీ హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో సమావేశమై దరఖాస్తుదారుల జాబితా రూపొందించింది. ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించి పది నియోజకవర్గాలకు 120 దరఖాస్తులు అందినట్లు వెల్లడించింది. అత్యధికంగా ఇల్లెందు నియోజకవర్గానికి 32 మంది దరఖాస్తు చేసుకోగా... మధిర నుంచి రెండే దరఖాస్తులు అందాయి. ఇక పినపాక నుంచి 17మంది, వైరా నుంచి 15మంది, పాలేరు నుంచి 14మంది, సత్తుపల్లి, కొత్తగూడెం నుంచి పది మంది చొప్పున దరఖాస్తు చేసుకున్నారు. అలాగే, ఖమ్మం నుంచి తొమ్మిది మంది, అశ్వారావుపేట నుంచి ఎనిమిది మంది, భద్రాచలం నియోజకవర్గం నుంచి పోటీ కోసం ముగ్గురు దరఖాస్తులు సమర్పించారు.

**నియోజకవర్గాల వారీగా ఇలా...**

- **ఖమ్మం నియోజకవర్గం** నుంచి టికెట్ కోసం తొమ్మిది మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పరుచూరి మురళీకృష్ణ, డాక్టర్ గంగదేవుల లోకేష్ యాదవ్, మానుకొండ రాధాకిషోర్, షేక్ చోటబాబా, నున్నా రామకృష్ణ, పుచ్చకాయల వీరభద్రం, మువ్వా విజయబాబు, మహ్మద్ జావీద్ ఉన్నారు.
- **మధిర స్థానం నుంచి పోటీ కోసం** మల్లు భట్టి విక్రమార్క, కోట రాంబాబు నుంచి దరఖాస్తులు అందాయి.
- **పాలేరు నియోజకవర్గం** నుంచి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్ల శ్రీరాంయాదవ్, రామిరెడ్డి శ్రీచరణ్‌రెడ్డి, రాయల నాగేశ్వరరావు, బైరు హరినాథ్‌బాబు, మద్ది శ్రీనివాసరెడ్డి, బెల్లం శ్రీనివాస్, మద్దినేని బేబీ స్వర్ణకుమారి, యరసాని శివశంకర్‌రెడ్డి, మువ్వా విజయబాబు, రామసహాయం మాధవీరెడ్డి, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, నాయుడు సత్యనారాయణ, సబవత్ రాములునాయక్ దరఖాస్తులు అందజేశారు.
- **వైరా నియోజకవర్గం** నుంచి పాలకుర్తి నాగేశ్వరరావు, బానోత్ బాబు(అర్జున్), మాలోత్ రాందాస్, బానోత్ సైదేశ్వరరావు, లకావత్ చంద్రనాయక్, బండ్ల రాంబాబు, అంగోతు శ్రీమన్నారాయణ, బానోతు విజయబాయి, డుంగ్రోత్ వెంకటేశ్వరరావు, వాంకుడోతు దీపక్, కూతాడి కుమార్, లకావత్ సైదులు, భూక్యా భిక్షపతి రాథోడ్ ఉన్నారు.
- **సత్తుపల్లి** నుంచి సంభాని చంద్రశేఖర్, కోటూరి మానవతారాయ్, చింతమళ్ల రవికుమార్, వక్కలగడ్డ సోమచంద్రశేఖర్, చింతమళ్ల పద్మ, మట్టా దయానంద్ విజయ్‌కుమార్, మట్టా రాగమయి, కొండూరి సుధాకర్, తోటమళ్ల నవీన్‌కుమార్, బొడ్డు బొందయ్య దరఖాస్తులు సమర్పించారు.
- **ఇల్లెందు నియోజకవర్గం** నుంచి బానోత్ విజయలక్ష్మి, గుగులోత్ కృష్ణనాయక్, చీమల వెంకటేశ్వర్లు, తేజావత్ బెల్లయ్య నాయక్, మాలోతు ఉదయ్‌సింగ్, అజ్మీరా శంకర్, భూక్యా మంగీలాల్ నాయక్, భూక్యా దళ్‌సింగ్‌నాయక్, కోరం కనకయ్య, పూనేం భూక్యా చంద్రకళ, మోకాళ్ల శ్రీనివాసరావు(శ్రీనివాస్ దొర), భూక్యా స్రవంతి, బానోత్ వెంకటేశ్వర్లు, డాక్టర్ గుగులోతు రవి, డుంగ్రోత్ వెంకటేశ్వరరావు, గుడెబోయిన నాగమణి, డాక్టర్ బానోత్ సంజయ్ నాయక్, బానోత్ వెంకటప్రవీణ్‌నాయక్, డాక్టర్ భూక్యా రామచంద్రనాయక్, నూనావత్ రాధ, పోరిక సాయిశంకర్, కలతి వెంకటేశ్వర్లు, మకాల శ్రీనివాసరావు, ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్, నూనావత్ శంకర్‌నాయక్, అరెం పాపారావు, మాలోతు వెంకటలాల్, డాక్టర్ బానోత్ నాగేశ్వరరావు, ఆంగోతు శివకుమార్, పెండెకట్ల యాకయ్య, ఆంగోత్ నమోదర్‌నాయక్, బానోత్ సామ్లా దరఖాస్తులు సమర్పించారు.

## జేఎన్‌టీయూ కళాశాల ఆరంభం..




**ఖమ్మంరూరల్:** ప్రభుత్వం ఇటీవల పాలేరు నియోజకవర్గానికి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేసింది. తాత్కాలికంగా ఖమ్మం రూరల్ మండలం బారుగూడెంలోని మహ్మదీయ కళాశాలలో తరగతుల నిర్వహణకు నిర్ణయించారు. ఈ సందర్భంగా మంగళవారం లాంఛనంగా తరగతులు ప్రారంభించారు.

## 32 పోస్టులు.. 424 దరఖాస్తులు!



దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన అభ్యర్థులు

**ఖమ్మం వైద్యవిభాగం:** ఖమ్మంలో త్వరలో మొదలుకానున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 32 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించగా భారీ స్పందన వస్తోంది. మెడికల్ కళాశాలలోని వివిధ విభాగాల్లో ఈ ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. ఇందుకోసం 26న నోటిఫికేషన్ విడుదల చేయగా, బుధవారం వరకు దరఖాస్తుకు అవకాశముంది. కానీ మంగళవారం నాటికే 424 దరఖాస్తులు అందాయి. అభ్యర్థులు భారీగా వస్తుండడంతో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిశాక 31న పరిశీలన పూర్తి చేసి, విద్యార్హతలు, మెరిట్, సీనియారిటీ, రిజర్వేషన్ ఆధారంగా మెరిట్ జాబితాను 1వ తేదీన కలెక్టర్ ఆమోదానికి పంపిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

# జిల్లాలో క్రీడాభివృద్ధికి పెద్దపీట

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి అజయ్‌కుమార్
- ఘనంగా ధ్యాన్‌చంద్ జయంతి

**ఖమ్మం స్పోర్ట్స్:** జిల్లాలో క్రీడాకారుల అభ్యున్నతి, క్రీడారంగం అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని.. ఈ అవకాశాలను ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. ప్రఖ్యాత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పించిన మంత్రి పలువురు క్రీడాకారులు, కోచ్‌లను సన్మానించాక మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయయగా, వచ్చేనెల 1నుంచి కిట్లను అందుబాటులోకి తీసుకొస్తోందని తెలిపారు. గడిచిన తొమ్మిదేళ్లలో సర్దార్ పటేల్ స్టేడియాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేశామని చెప్పారు. అలాగే, వైరా, కల్లూరు, మధిరలో స్టేడియంలు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. కలెక్టర్ వీ.పీ గౌతమ్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లోని పీఈటీలు శ్రద్ధ వహించి విద్యార్థులను తీర్చిదిద్దలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, విజయ్‌కుమార్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెటరన్ క్రీడాకారులు సత్యనారాయణ-దుర్గను సన్మానిస్తున్న మంత్రి అజయ్, కలెక్టర్ గౌతమ్, మేయర్ నీరజ

### అడ్తిదారుల లైసెన్సులకు గ్రీన్ సిగ్నల్

**ఖమ్మంవ్యవసాయం:** ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో నూతన అడ్తిదారులకు లైసెన్సులు జారీ చేయాలని పాలకవర్గం నిర్ణయించింది. ఇప్పటి వరకు 470 మంది అడ్తీవ్యాపారులు ఉండగా, 2016 తర్వాత కొత్తగా ఎవరికీ లైసెన్స్ ఇవ్వలేదు. ఇందులో భాగంగా మంగళవారం మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత అధ్యక్షతన జరిగిన పాలకవర్గ సమావేశంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడ్తిదారుల వ్యవహారం చర్చకు రావడంతో ప్రస్తుతం కొందరికి, మార్చి నాటికి మరికొందరికి లైసెన్సు ఇవ్వాలని నిర్ణయించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పారదర్శకంగా ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. అనంతరం మార్కెట్‌లో అభివృద్ధి పనులపై సమీక్షించారు. మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్‌కుమార్, మార్కెట్ వైస్ చైర్మన్ షేక్ అఫ్జల్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలంతోపాటు జీ.వై.నరేష్, మన్నెం కృష్ణ, తల్లాడ రమేష్, పత్తిపాక రమేష్, దేవత అనిల్, గుండ్ల ముత్తయ్య, జాటోత్ సుందర్, మందా రామకృష్ణ, పోట్లపల్లి నాగరాజు, యాసా రామారావు, కుతుంబాక నరేష్, తాతా వెంకటేశ్వర్లు, వంకాయలపాటి వెంకటలచ్చయ్య, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఆర్.మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# రహదారిని విస్తరించాల్సిందే...

- కేఎంసీ ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యాన ధర్నా
- డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా సహా నేతల అరెస్ట్

**ఖమ్మం సహకారనగర్:** ఖమ్మం 54వ డివిజన్‌లో 3.75 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్న రహదారిని ఐదు మీటర్లకు పెంచాలనే డిమాండ్‌తో కాంగ్రెస్ కార్పొరేటర్లు, నాయకులు మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఈ సమస్యపై కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల ఆధ్వర్యాన సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నిరసన తెలిసిన విషయం విదితమే. ఇక మంగళవారం ధర్నాకు దిగగా కార్పొరేటర్ సహా నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్ మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే రహదారి వెడల్పు పెంచాలని కోరితే పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. కనీసం కార్పొరేషన్‌లో వినతిపత్రం ఇవ్వకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. ధర్నాలో కార్పొరేటర్లు మిక్కిలినేని మంజుల, మలీదు వెంకటేశ్వర్లు, సైదులు, నాయకులు మిక్కిలినేని నరేందర్, పుచ్చకాయల వీరభద్రం, కొంగర జ్యోతిర్మయి, షేక్ ఇమామ్, నరేష్, మోహన్ నాయుడు, విప్లవ్ కుమార్, చంద్రశేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు. కాగా, పోలీసులను నాయకులను అరెస్ట్ చేయగా, నాయకులు మద్దినేని బేబి స్వర్ణకుమారి, తుంబూరు దయాకర్ రెడ్డి, గోనె భుజంగరెడ్డి సంఘీభావం తెలిపారు. ఇక నాయకుల అరెస్టను డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో ఖండించారు.



కేఎంసీ ఎదుట ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు

**కార్పొరేటర్ మంజులపై కేసు**

**ఖమ్మంక్రైం:** విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా తన చేయికి గాయం చేశారనే వన్ టౌన్ సీఐ స్వామి ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ మిక్కిలినేని మంజులపై ఖమ్మం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేఎంసీ వద్ద ధర్నా సందర్భంగా పోలీసులు అదుపులోకి తీసుకుంటుండగా కార్పొరేటర్ మంజుల తన చేయి కొరకగా, మిగతా నాయకులకు విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు. కాగా, పోలీసుల విధులను అడ్డుకుని సీఐపై కార్పొరేటర్, ఆమె భర్త దౌర్జన్యం చేయడం సరికాదని పోలీస్ అసోసియేషన్ బాధ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# క్లుప్తంగా

## రేపు రాఖీపౌర్ణమి

**ఖమ్మంగాంధీచౌక్:** రాఖీపౌర్ణమి పర్వదినాన్ని గురువారం జరుపుకోవాలని తెలంగాణ విద్వత్సభ నిర్ణయించింది. ఈనెల 17న తెలంగాణ విద్వత్సభ ప్రతినిధులు సమావేశమై నిర్ణయం తీసుకున్నారు. రాఖీ పౌర్ణమి బుధవారం, గురువారాల్లో ఎప్పుడు జరుపుకోవాలనే అంశంపై చర్చ జరుగుతుండగా, తెలంగాణ విద్వత్సభ బాధ్యులు గురువారంగా నిర్ణయించారు. ఈ విషయాన్ని జిల్లా వైదిక బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్ష కార్యదర్శులు తాటికొండల సీతారామశాస్త్రి, సన్నిధానం జగన్నాథశర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

**మార్కెట్‌కు సెలవు**

రాఖీ పండుగను పురస్కరించుకుని గురువారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సెలవు ప్రకటించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ బాధ్యుల వినతితో సెలవు ప్రకటించినట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం తెలిపారు.

## ఆర్కే ఫౌండేషన్‌కు నంది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న రామకృష్ణ దంపతులు

**మధిర:** సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మధిరకు చెందిన ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులకు బంగారు నంది పురస్కారం లభించింది. మంజునాథ ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ - జ్యోతి దంపతులకు ఎంపీ ఆర్.కృష్ణయ్య పురస్కారం అందజేశారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థులకు గ్లాసులు అందజేస్తున్న దృశ్యం

**చింతకాని:** ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్ సూచించారు. మండలంలోని నాగులవంచ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వంకాయలపాటి సీతయ్య ట్రస్ట్ ఆధ్వర్యాన సమకూర్చిన స్టీల్ గ్లాసులను ఆయన మంగళవారం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత విద్య అందడమే కాక అన్ని సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. సర్పంచ్ ఆలస్యం నాగమణి, వంకాయలపాటి సీతయ్య ట్రస్ట్ చైర్మన్ వంకాయలపాటి సత్యనారాయణతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దారి అడిగి సెల్ చోరీ

**నేలకొండపల్లి:** ఖమ్మం వెళ్లేందుకు దారి ఎటు అని ఆరా తీస్తూ సెల్‌ఫోన్ చోరీ చేసిన వ్యక్తి పారిపోతూ పోలీసులకు చిక్కాడు. మండల కేంద్రంలో కోదాడ-జాతీయ రహదారి నిర్మాణ పనులు చేసేందుకు బీహార్ కూలీలు వచ్చారు. అక్కడకు మంగళవారం వచ్చిన నిందితుడు ఖమ్మం వెళ్లేందుకు దారి ఎటు అని అడిగి కూలీలు చెబుతుండగానే సెల్‌ఫోన్ లాక్కుని బైక్‌పై పారిపోయాడు. ఈక్రమంలో కూలీలు వెంటపడగా ఓ ప్రైవేట్ స్కూల్‌లోకి వెళ్లడంతో సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని నిందితుడు, బైక్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆయనపై గతంలోనూ చోరీ కేసులు ఉన్నాయనే అనుమానంతో విచారణ చేస్తున్నారు. ఈ విషయాన్ని పోలీసులు ధృవీకరించలేదు.

## కూసుమంచి శివాలయంలో..

**కూసుమంచి:** కూసుమంచిలోని శివాలయం(గణపేశ్వరాలయం)లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. దుండగులు ఆలయ గేట్ల తాళం పగులగొట్టి లోనకు ప్రవేశించారు. ఆతర్వాత హుండీ తాళం పగులగొట్టి సుమారు రూ.25వేల నగదు ఎత్తుకెళ్లారు. ఆలయానికి మంగళవారం ఉదయం వచ్చిన అర్చకులు శేషగిరిశర్మ ఈ విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. కాగా, కాలంలో ఆలయంలో చోరీ జరగడం ఇటీవల మూడోసారి కావడం గమనార్హం.

## ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

| | గరిష్ట | కనిష్ట |
|---|---|---|
| మొక్కజొన్న | 1,600 | 1,600 |
| పెసలు | 8,000 | 7,400 |
| అలసంద | 8,617 | 8,617 |
| మిర్చి | 19,000 | 13,000 |
| ఏసీ మిర్చి | 24,300 | 18,500 |
| పత్తి | 7,325 | 5,000 |

– ఖమ్మం వ్యవసాయం

## పామాయిల్ గెలలు

| | |
|---|---|
| టన్ను ధర | రూ.13,091 |

# బీజేపీ సత్తా చాటిన ఖమ్మం సభ

**ఖమ్మం మామిళ్లగూడెం:** బీజేపీ బలోపేతమవుతోందని చెప్పడానికి ఇటీవల ఖమ్మంలో జరిగిన సభే నిదర్శమని పార్టీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. కేంద్ర హోం మంత్రి మంత్రి అమిత్ షా హాజరైన సభ జయప్రదం కావడానికి జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నేతలు తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. భద్రాచలానికి అమిత్‌షా వెళ్లలేదని చెబుతున్న బీఆర్ఎస్ నేతలు... కేసీఆర్ తలంబ్రాలు సమర్పించకపోవడం, అభివృద్ధికి ప్రకటించిన నిధులు ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని సూచించారు. కాగా, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి నేతృత్వాన ప్రసాద్ పథకం ద్వారా భద్రాచలం అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ సభకు తరలివచ్చిన పార్టీ శ్రేణులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు తక్కెళ్లపల్లి నరేంద్రరావు, రుద్ర ప్రదీప్, నున్న రవికుమార్, మంద సరస్వతి, చంద్రశేఖర్, అల్లిక అంజయ్య, ఏలూరి నాగేశ్వరావు, చావా కిరణ్, ఉపేందర్‌గౌడ్, కె.నాగేశ్వరావు, దీకొండ శ్యాం, గజ్జల శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పక్కన నాయకులు

# వైరాలో రహదారిపై మళ్లీ రగడ

**వైరా:** వైరా రిజర్వాయర్ వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణంపై మళ్లీ ఆందోళనలు మొదలయ్యాయి. పది రోజుల క్రితం ఆక్రమణల కూల్చివేత మొదలుపెట్టగా, ఓవైపే తొలగిస్తున్నారని అఖిలపక్షం నేతలు నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్, రెవెన్యూ అధికారులు అఖిలపక్షం నాయకులతో చర్చించి రోడ్డును 60 అడుగుల మేర వెడల్పు చేస్తామని ప్రకటించచారు. ఈనేపథ్యాన మంగళవారం మున్సిపల్ కమిషనర్ పితాని వెంకటేశ్వర్లు, తహసీల్దార్ కే.వీ.శ్రీనివాస్ ఆక్రమణల తొలగింపునకు రంగంలోకి దిగారు. అయితే, గతంలో తీసుకున్న నిర్ణయాన్ని విరుద్ధంగా పనులు చేపడుతున్నారనే సమాచారంతో అఖిలపక్షం నాయకులు అధికారులతో చర్చించారు. ఒప్పందం ప్రకారం 60 అడుగుల మేర రహదారి నిర్మించాల్సిందేనని పట్టుబట్టడంతో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో అధికారులు ఆక్రమణల తొలగింపు నిలిపేశారు.



అధికారులతో మాట్లాడుతున్న నాయకులు

### గ్రామాల్లో డీఆర్‌డీఓ పర్యటన

**సత్తుపల్లిరూరల్:** మండలంలోని చెరుకుపల్లి, రేగళ్లపాడు, బుగ్గపాడు పంచాయతీల్లో మంగళవారం డీఆర్‌డీఓ విద్యాచందన పర్యటించారు. ఈ సందర్భంగా పల్లె ప్రకృతివనాలు, నర్సరీలు, వైకుంఠధామాలను ఆమె పరిశీలించారు. అలాగే, ఐకేపీ ఆధ్వర్యాన రుణాలతో ఏర్పాటుచేసిన షాపులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. సర్పంచ్‌లు కారం జయేంద్రరావు, ఐరపా లలిత, ఎంపీడీఓ జయరాం, ఎంపీఓ కృష్ణ, కార్యదర్శి దినేష్‌సాయి పాల్గొన్నారు.

### గాయం ఆధారంగా పరిహారం ఉండాలి

**ఖమ్మంలీగల్:** రోడ్డు ప్రమాద కేసుల్లో బాధితులకు తగిలిన గాయం ఆధారంగా నష్టపరిహారం నిర్ణయించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీ.ఎస్.జగ్జీవన్ కుమార్ సూచించారు. వచ్చేనెల 9న జాతీయ లోక్ అదాలత్ జరగనుండగా, బీమా కంపెనీ ప్రతినిధులు, న్యాయవాదులతో మంగళవారం న్యాయమూర్తి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాయం, చికిత్స అయిన ఖర్చు, నష్టపోయిన పనిగంటలను పరిగణనలోకి తీసుకుని పరిహారాన్ని చెల్లించాలని తెలిపారు. ఈ విషయంలో మానవతా దృక్పథమే ముఖ్యమని చెప్పారు. న్యాయసేవాసంస్థ న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా, బీమా కంపెనీ అధికారి రేణు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దిరిశాల కృష్ణారావు, ఎం.బసవయ్య పాల్గొన్నారు.

### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



నాగులవంచలోని షాపులో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు

**చింతకాని:** ఎరువులు, విత్తనాల దుకాణదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ ఖమ్మం సహాయ సంచాలకులు అజ్మీరా శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని నాగులవంచ, చింతకాని, లచ్చగూడెం, కొదుమూరు గ్రామాల్లో షాపులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రశీదులు లేకుండా ఎలాంటి విక్రయాలు చేపట్టవద్దని, స్టాక్ వివరాలను వ్యవసాయ శాఖకు తెలియజేయాలని సూచించారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మినా, అనుమతి లేని ఎరువులు విక్రయించినా చర్యలు తప్పవని చెప్పారు. మండల వ్యవసాయాధికారి పల్లెల నాగయ్య, ఏఈఓలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో మాదిగలకు అన్యాయం

తెలంగాణ మాదిగ రాజకీయ పోరాట వేదిక కన్వీనర్ సోమచంద్రశేఖర్

**ఖమ్మంమామిళ్లగూడెం:** కాంగ్రెస్‌లో గత 45 ఏళ్లుగా జిల్లాలోని మాదిగలకు అన్యాయం జరుగుతోందని తెలంగాణ మాదిగ రాజకీయ పోరాట వేదిక కన్వీనర్ వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ పేర్కొన్నారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో మాదిగలు 12 శాతం, జిల్లాలోని దళితుల్లో 75 శాతం మంది ఉన్నారన్నారు. అయినా సత్తుపల్లిలో 25 శాతం ఉన్న మాలలకు, జిల్లాలో వెయ్యి ఓట్లు కూడా లేని మాల దాసరి వారికి మధిర సీటు కేటాయించడంతో మాదిగలకు అన్యాయం జరుగుతోందన్నారు. జిల్లాలోని ప్రతీ నియోజకవర్గంలో మాదిగలు గెలుపోటములను ప్రభావితం చేయగలిగే స్థాయిలో ఉన్నా సీటు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారైనా జనాభా దామాషా ప్రకారం మాదిగలకు రెండు సీట్లు కేటాయించాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే మాదిగలు అత్యధిక శాతం ఉన్న మధిరలో సీటు కేటాయించకపోతే ఆత్మగౌరవాన్ని కించపర్చినట్లవుతుందని చెప్పారు. కాగా, చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ విడుదల డిక్లరేషన్ ఆధారంగా పొందుపరిచినట్లుగా జనాభా దామాషా ప్రకారం మాదిగలకు 15 సీట్లు కేటాయించాలని సోమచంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పోరాట వేదిక సభ్యులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న వక్కలగడ్డ సోమచంద్రశేఖర్

### రైల్వేస్టేషన్ తరలించొద్దని ఆందోళన

**కారేపల్లి:** మండలంలోని గాంధీపురం రైల్వేస్టేషన్‌ను రెండు కిలోమీటర్లలో దూరాన చర్లపల్లి వద్ద నిర్మిస్తున్న నూతన స్టేషన్‌కు తరలించవద్దని స్థానికులు ఆందోళనకు దిగారు. అలాగే, గాంధీపురం రైల్వేస్టేషన్ పేరు మార్చొద్దని డిమాండ్ చేశారు. ఈమేరకు గాంధీపురం రైల్వేస్టేషన్, చర్లపల్లి వద్ద నూతన స్టేషన్ పరిశీలనకు వచ్చిన సింగరేణి తహసీల్దార్ వంకాయల సురేష్‌కుమార్‌కు మంగళవారం వారు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు కాపా చంద్రశేఖర్, కేసగాని రామ్మూర్తి, జామ్లా, కాపా సుధాకర్, ఈసాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### 400 లీటర్ల నాటుసారా స్వాధీనం

**నేలకొండపల్లి:** మండలంలోని శంకరగిరితండాలో ఎక్సైజ్ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా అమ్మకానికి సిద్ధంగా ఉన్న 400 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కుమ్మరి పోశెట్టి తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై శంకర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

**ఐదుగురి బైండోవర్**

**కల్లూరు రూరల్:** మండలంలోని పలు గ్రామాల్లో నాటుసారు తయారుచేస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ ఎస్ఐ అల్లూరి సీతారామరాజు ఆధ్వర్యాన మంగళవారం దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా పాతబోడిమెల్ల, ఎర్రబంజరు, బత్తులపల్లి, హనుమతండా, రాళ్లబంజరు(లక్ష్మీపురం) గ్రామాల్లో తనిఖీలు చేశారు. ఈమేరకు సారా తయారుచేస్తున్న బంతిరాం, గుగులోత్ రాములు, జర్పుల కుమారి, గుగులోత్ ధర్మి, బానోతు మీరాను కల్లూరు తహసీల్దార్ బాబ్జీ ప్రసాద్ ఎదుట బైండోవర్ చేశారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఉద్యోగులు వెంకటేశ్, నాగరాజు, శ్రీనివాసరావు, నరసింహ, ప్రేమ్‌కుమార్, నర్సింహారావు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**కొణిజర్ల:** పంక్చర్ అయిన వాహనాన్ని నెట్టుకుంటూ వెళ్తున్న యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మండలంలోని తనికెళ్ల సమీపాన సోమవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన వివరాలను ఎస్ఐ జె.శంకరరావు వెల్లడించారు. ఖమ్మం ఖిలా బజార్‌కు చెందిన షేక్ షంషుద్దీన్(20) టైల్స్ పని చేస్తుండగా, తన స్నేహితుడు షేక్ అక్రమ్‌తో కలిసి కొత్తగూడెంలో పని పరిశీలించేందుకు వెళ్లి సోమవారం రాత్రి వస్తున్నాడు. తనికెళ్ల దాటాక వీరి ద్విచక్ర వాహనం పంక్చర్ కావడంతో స్నేహితుల మరో వాహనంపై అక్రమ్ వెళ్లిపోయాడు. ఆతర్వాత షంషుద్దీన్ వాహనం నెట్టుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తల, కాళ్లకు తీవ్ర గాయాలు కాగా ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈమేరకు మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ సభ్యులు మార్చురీ తరలించగా, మృతుడి సోదరుడు షేక్ మున్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### చికిత్స పొందుతున్న యువకుడు...

**కల్లూరురూరల్:** పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మండలంలోని తాళ్లూరు వెంకటాపురానికి చెందిన మోదుగు కిరణ్‌కుమార్(22) మనస్తాపానికి గురై ఈనెల 23వ తేదీన పురుగుల మందు తాగాడు. ఆయనను ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

### తాత వద్దకు వెళ్తానని.. ఆత్మహత్యాయత్నం

**కారేపల్లి:** తాత మృతిని జీర్ణించుకోలేని మనవడు.. తాత వద్దకే వెళ్తానంటూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని పేరుపల్లికి చెందిన కేలోతు సిద్దు ఖమ్మంలో ఇంటర్ చదువుతున్నాడు. సిద్దు తాత కేలోతు పెద్ద ఈర్యా రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి సిద్దు హాస్టల్‌కు వెళ్లేందుకు మారాం చేస్తున్నాడు. తరచుగా తాత గుర్తుకొస్తున్నాడు, తనను పిలుస్తున్నాడంటూ ఆయన వద్దకు వెళ్తానని చెప్పేవాడు. ఇంతలోనే మంగళవారం ఇంట్లోనే పురుగుల మందు తాగగా సిద్దును కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

### ఇంటర్ విద్యార్థి అదృశ్యంపై కేసు

**ఖమ్మంఅర్బన్:** జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ జూనియర్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్న తాటికొండ సాయి కానరాకుండా పోయాడని ఆయన తండ్రి ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ముదిగొండ మండలం కోదండరామాపురానికి చెందిన సాయిని కొన్ని నెలల క్రితం కుక్క కరిచింది. దీంతో ఇంజక్షన్ వేయించుకునేందుకు సోమవారం హాస్టల్ నుంచి వచ్చిన ఆయన తిరిగి వెళ్లలేదు. దీంతో ఆయన తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### చంపుతామని బెదిరించిన వారిపై కేసు

**ఖమ్మంఅర్బన్:** భూమి కొనుగోలు ఒప్పందం విషయంలో ఇంటిపై దాడి చేసి చంపుతానని బెదిరించిన ఘటనపై ఖమ్మం అర్బన్ మంగళవారం కేసు నమోదు చేశారు. నగరంలోని శ్రీరాంహిల్స్ కాలనీలో నివాసముంటున్న కె.లక్ష్మి భర్త రఘురాంరెడ్డి ఒక భూమి విషయంలో ఖమ్మంకు చెందిన ఏ.వెంకటేశ్వర్లుకు అగ్రిమెంట్ చేశారు. అయితే, ఒప్పందం ప్రకారం డబ్బు చెల్లించకపోవడంతో ఇతరులకు అమ్మేశారు. దీంతో వెంకటేశ్వర్లు సోమవారం 20మందితో వచ్చి శ్రీలక్ష్మి ఒంటరిగా ఉన్న సమయాన సామగ్రి ధ్వంసం చేయడమే కాక చంపుతానని బెదిరించాడు. ఈమేరకు బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# పోరాటాలు హుందాగా ఉండాలి

**ఖమ్మంమయూరిసెంటర్:** గతంలో ప్రతిపక్ష పార్టీలు ప్రజల సమస్యల పరిష్కారానికి ఆందోళనలు చేపట్టగా.. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత లక్ష్యంతో ఆందోళనకు దిగాయని మేయర్ పునుకొల్లు నీరజ, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు ఆరోపించారు. కేఎంసీలోని మేయర్ చాంబర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రోడ్డు వెడల్పు చేయాలనే డిమాండ్‌తో కాంగ్రెస్ కార్పొరేటర్ చేస్తున్న ఆందోళన సరికాదన్నారు. 54వ డివిజన్‌కు కేటాయించిన సుడా నిధులు ఖర్చు చేయగా మిగిలిన వాటితో సమీకృత మార్కెట్‌కు రోడ్డు వేస్తే రాద్ధాంతం చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, కార్పొరేటర్లు ప్రశాంత లక్ష్మి, రుద్రగాని శ్రీదేవి, షేక్ మక్బూల్, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి పాల్గొన్నారు. కాగా, మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి పాటుపడాల్సిన కార్పొరేటర్ రహదారి నిర్మాణాన్ని అడ్డుకోవడం గర్హనీయమన్నారు. ఈ సమావేశంలో పిల్లి శేఖర్, నర్సింహారావు, సంపత్, నరేందర్, పువ్వాళ్ల నాగేశ్వరరావు, రమణ, మల్లేపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ నీరజ, పక్కన పగడాల నాగరాజు తదితరులు

# తుమ్మలను కలిసిన అనుచరులు



అనుచరులతో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఖమ్మంరూరల్:** పాలేరు నియోజకవర్గంలోని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుచరులు మంగళవారం ఆయనను దమ్మపేట మండలం గండుగులపల్లిలో స్వగృహంలో కలిశారు. బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాలో తుమ్మల పేరు లేని విషయం విదితతమే. అప్పటినుంచి కాంగ్రెస్‌లో చేరాలని కోరుతున్న అనుచరులు, నిర్ణయం త్వరగా తీసుకోవాలని విన్నవించినట్లు తెలిసింది. అయితే, తుమ్మల మాత్రం కొన్నాళ్లు ఓపిక పట్టండి, అందరికీ నచ్చేలా నడుచుకుంటానని తెలిపినట్లు సమాచారం. ఈకార్యక్రమంలో జొన్నలగడ్డ రవికుమార్, తేజావత్ పంతులునాయక్, బండి జగదీష్, తోట. వీరభద్రం, తల్లంపాడు సర్పంచ్ శివశంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# నాణేనికి అటు.. ఢిల్లీలో డ్రామా!

## ఎంపిక చేసుకున్న విలేకరుల సమావేశంలో బీజేపీపై చంద్రబాబు ప్రేమ బాణాలు

- తాను మొదటి నుంచీ కేంద్రంలో పొత్తులోనే ఉన్నాడట..
- హోదా కోసమే ఎన్డీఏ నుంచి బయటకు వచ్చానంటూ మరోసారి నాలుక మడత
- హోదా ఏమైనా సంజీవనా?.. ప్యాకేజీ అంతకంటే మెరుగైనదంటూ అర్ధరాత్రి ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పిన విషయం ప్రజలకు గుర్తుండదనే ధీమా
- పోలవరం కాంట్రాక్టుల కోసం హోదాను తాకట్టు పెట్టిన ఘనత బాబుదే
- రామోజీ వియ్యంకుడు, యనమల వియ్యంకుడిని కాంట్రాక్టర్లుగా ప్రవేశపెట్టి డబ్బు దండుకున్న విషయం ఎవరూ మరువలేరు
- రాజధాని పేరుతో బాబు భారీ స్కామ్‌కు తెరతీయడంతో తీవ్ర ప్రజా వ్యతిరేకత
- దాన్ని కేంద్రంపైకి మళ్లించడం కోసం చివరి ఏడాది ఎన్డీఏ నుంచి బయటకు టీడీపీ
- 2019 ఎన్నికల్లో బెడిసికొట్టిన అంచనాలు.. బీజేపీలోకి కోవర్టులను ప్రవేశపెట్టిన బాబు
- తన పార్ట్‌నర్ పవన్‌ను కాషాయం ఫ్రంట్‌లో చేర్చి ఢిల్లీ కరుణ కోసం వేడుకోలు
- ఆ ప్రయత్నాలకు తోడు కొత్తగా పురందేశ్వరి కుటుంబంతో కుదిరిన రాజీని బీజేపీతో పొత్తు కోసం వాడుకుంటున్న చంద్రబాబు



సాక్షి, అమరావతి: పార్టీ భవిష్యత్‌పై ఆశలు ఆవిరవడంతో తీవ్ర నిరాశ, నిస్పృహలో కూరుకుపోయిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తాజాగా బీజేపీతో పొత్తు కోసం ఢిల్లీలో పెద్ద డ్రామానే నడిపారు! ఎన్టీఆర్ స్మారక నాణెం విడుదల కార్యక్రమాన్ని ఇందుకు వినియోగించుకున్నారు. ఆ కార్యక్రమం ముగిసిన తరువాత రెండో రోజు ఢిల్లీలో ఎంపిక చేసుకున్న విలేకరుల సమక్షంలో బీజేపీపై చంద్రబాబు ప్రేమ బాణాలు విసరడం చర్చనీయాంశమైంది. తాను మొదటి నుంచి కేంద్రంలో పొత్తులోనే ఉన్నానంటూ బీజేపీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు ఆయన ప్రయత్నించారు. ప్రత్యేక హోదా కోసమే గతంలో తాను ఎన్డీయే నుంచి బయటకు వచ్చానంటూ తాజాగా చంద్రబాబు మరోసారి నాలుక మడతేశారు. 'హోదా ఏమైనా సంజీవనా..? ప్యాకేజీ అంతకంటే మెరుగైనదంటూ అధికారంలో ఉండగా అర్ధరాత్రి తాను ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పిన విషయం ప్రజలకు గుర్తుండదనే భ్రమతో తనకు అలవాటైన రీతిలో చంద్రబాబు అలవోకగా అబద్ధాలు చెప్పేశారు. పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టుల కోసం ప్రత్యేక హోదాను చంద్రబాబు తాకట్టు పెట్టిన విషయం జనం మది నుంచి చెదిరిపోలేదు. రామోజీరావు, యనమల రామకృష్ణుడు వియ్యంకులను కాంట్రాక్టర్లుగా ప్రవేశపెట్టి ప్రాజెక్టు సొమ్మును ఏటీఎంలా వాడుకుని డబ్బులు దండుకున్న విషయాన్ని ప్రజలెవరూ ఎప్పటికీ మరువలేరు! ఇవన్నీ ఎవరికీ గుర్తుండవనే ఉద్దేశంతో బీజేపీతో పొత్తు కోసం పాకులాడుతూ చంద్రబాబు నిస్సిగ్గుగా అబద్ధాలాడారు!

### ప్రజా వ్యతిరేకత నుంచి బయటపడేందుకు ఎన్డీఏ నుంచి బయటకు

చంద్రబాబు అధికారంలో ఉండగా రాజధాని అమరావతి పేరుతో భారీ అంతర్జాతీయ స్కామ్‌కు తెరతీయడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. రాజధాని ముసుగులో ఆయన చేసిన అక్రమాలు బయటపడడంతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వెల్లి విరిసింది. దీన్ని కేంద్ర ప్రభుత్వంపై మళ్లించడం కోసం తన పాలన చివరి సంవత్సరంలో చంద్రబాబు ఎన్డీఏ నుంచి బయటకు వచ్చారు. కానీ తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లుగా ఎన్నికల్లో ఆయన అంచనాలు బెడిసికొట్టి చిత్తుచిత్తుగా ఓడిపోయారు. వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. దీంతో చంద్రబాబు వెంటనే బీజేపీలోకి తన కోవర్టులను ప్రవేశపెట్టారు. తన మిత్రుడైన పవన్ కల్యాణ్‌ను సైతం కాషాయ ఫ్రంట్‌లో చేర్చారు. ఘోర ఓటమి తర్వాత మళ్లీ ఎలాగైనా బీజేపీ పంచన చేరడానికి చంద్రబాబు చేయని ప్రయత్నం లేదు. ఆ ప్రయత్నాలకు తోడు తాజాగా పురందేశ్వరితో రాజీ చేసుకుని బీజేపీతో పొత్తు అవసరాలకు వాడుకున్నారు. ఇటీవలే బీజేపీ అధ్యక్షురాలైన పురందేశ్వరి కుటుంబంతో చంద్రబాబుకు రాజీ కుదిరింది. బీజేపీలో ఉంటూ చంద్రబాబుకు సహకరించేందుకు పురందేశ్వరి అంగీకరించారు. అందులో భాగంగానే ఎన్టీఆర్ స్మారక నాణెం విడుదల కార్యక్రమం సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు బాబును దగ్గర చేసేందుకు ఆమె తాపత్రయపడ్డారు.

### నాణెం విడుదల కార్యక్రమానికి సతీమణిని పిలవరా?

పురందేశ్వరి చంద్రబాబు ఏజెంటులా పనిచేస్తున్నారని ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీపార్వతి ఆరోపించిన విషయం తెలిసిందే. ఎన్టీఆర్ నాణెం విడుదల కార్యక్రమాన్ని ఆయన సతీమణిని పిలవకుండా నిర్వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్టీఆర్‌ను చివరి దశలో వంచించి వేధించిన కుటుంబ సభ్యులంతా ఇప్పుడు మరోసారి ఆయన భార్యను అవమానించారు.

### ఆ వంకతో నడ్డాతో చంద్రబాబు భేటీ

ఇక ఎన్టీఆర్ నాణెం విడుదల కార్యక్రమం వంకతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాతో చంద్రబాబు వంగి వంగి మంతనాలాడారు. ఈ భేటీలో టీడీపీ కోవర్టులు తప్ప మిగిలిన పాత బీజేపీ నేతలు ఎవరూ లేకపోవడం కొసమెరుపు. అక్కడ చంద్రబాబు తన పొత్తు ప్రతిపాదనలను నడ్డా ఎదుట పెట్టి ఎలాగైనా పొత్తు కుదిరేలా చూడాలని కోరారు. నడ్డా నుంచి ఆశించిన స్పందన వచ్చిందో లేదో తెలియదు గానీ రెండో రోజు చంద్రబాబు ఎంపిక చేసిన విలేకరుల కోసం లంచ్ మీటింగ్ ఏర్పాటు చేశారు. అక్కడ మోదీ సర్కార్‌పై తన ప్రేమను చాటుకున్నారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా మంచి సంబంధాలు అవసరమని తాజాగా చంద్రబాబు ప్రవచించారు. చంద్రబాబు తాను సీఎంగా ఉండగా ప్రధాని మోదీ రాష్ట్రానికి వచ్చినప్పుడు నల్లజెండాలు ఎగరేయడం, నిరసన తెలియచేస్తూ హోర్డింగ్‌లు పెట్టడం, బీజేపీ అగ్రనేత అమిత్‌షా కారు మీద తిరుపతిలో రాళ్లతో దాడి చేయించిన విషయాలను కప్పిపుచ్చేందుకు ప్రయత్నించటాన్ని నెటిజన్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ చేస్తున్నారు. బీజేపీతో పొత్తు కోసం శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్న చంద్రబాబు మరోసారి ఎన్టీఆర్ పేరును ఉపయోగించుకున్నారు. ఎన్టీఆర్ స్మారక నాణెం కార్యక్రమాన్ని తన పొత్తు చర్చల కోసం వినియోగించుకుని మరోసారి ఆయనకు వెన్నుపోటు పొడిచారు.

వేలమంది సమక్షంలో లక్ష్మీ పార్వతిని తన భార్యగా ఎన్టీఆర్ బహిరంగంగానే ప్రకటించిన విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందే. ఆమెను కార్యక్రమానికి రానివ్వకుండా గూడుపుఠాణి చేసి కేవలం చంద్రబాబుకు సన్నిహితులైన కుటుంబ సభ్యులు మాత్రమే ఆ కార్యక్రమానికి హాజరయ్యేలా చేశారు. ఇందులోయ ఎలాంటి గూడుపుఠాణి లేకపోతే లక్ష్మీపార్వతిని పిలవవచ్చు కదా? అనే ప్రశ్నకు సమాధానం లేదు.

## నవ ప్రపంచాన్ని నిర్మించే శక్తి యువత సొంతం

### ఏఎన్‌యూ స్నాతకోత్సవంలో ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్



పాలగుమ్మి సాయినాథ్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, వీసీ ఆచార్య రాజశేఖర్

ఏఎన్‌యూ: సాంకేతికతను సద్వినియోగం చేసుకుని నవ ప్రపంచాన్ని నిర్మించే శక్తి యువతకు ఉందని ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 39, 40వ స్నాతకోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ చాన్స్‌లర్ హోదాలో పాల్గొన్న గవర్నర్ సందేశం ఇస్తూ మానవాళి ప్రయోజనాలు పరిరక్షించే నూతన ఆవిష్కరణలకు యువత కృషిచేయాలని సూచించారు. చదువు, సాంకేతిక పరిజ్ఞానంతోపాటు నైతికత, సామాజిక బాధ్యత కూడా ముఖ్యమని చెప్పారు. యువత నేర్చుకునే సాంకేతిక, నైపుణ్యం కేవలం తమ సొంతానికి మాత్రమే కాకుండా సమాజ హితం కోసం వాడాలని సూచించారు. ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లు, సంక్షోభాలకు పరిష్కారం చూపే వైవిధ్యభరితమైన ఆవిష్కరణలు చేయడంతోపాటు వాటి ద్వారా అపారమైన అవకాశాలు సృష్టించాలని సూచించారు. యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఏఎన్‌యూ అభివృద్ధి నివేదికను సమర్పించారు. అనంతరం ప్రముఖ సంపాదకుడు పాలగుమ్మి సాయినాథ్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. పలువురు విద్యార్థులకు పీహెచ్‌డీలు, బంగారు పతకాలు, డిగ్రీ పట్టాలు అందించారు.

### వ్యవసాయ రంగ సమస్యలపై అధ్యయనం చేసిన తొలి రాష్ట్రం ఏపీ: సాయినాథ్

వ్యవసాయ రంగంలో సంక్షోభం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ప్రముఖ సంపాదకుడు పాలగుమ్మి సాయినాథ్ చెప్పారు. ఏఎన్‌యూ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం, రైతుల సమస్యలపై తాను 2001–2002 కాలంలో అధ్యయనం చేశానని చెప్పారు. 2006లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రంలో వ్యవసాయ రంగ సంక్షోభంపై అధ్యయనానికి ప్రత్యేకంగా కమిటీని నియమించారని తెలిపారు. ఈ కమిటీ సుదీర్ఘకాలంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం గురించి నిశితంగా అధ్యయనం చేసిందని పేర్కొన్నారు. తన సొంత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌తోపాటు పలు ప్రాంతాల్లో వ్యవసాయరంగ సమస్యలు, వాస్తవ పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేశానని తెలిపారు. ఆ సేవలకు దక్కిన గౌరవంగా ఈ డాక్టరేట్‌ను భావిస్తానని సాయినాథ్ తెలిపారు.

## సత్తా చాటుతున్న సహకార బ్యాంకులు

### టెస్కాబ్ టర్నోవర్ రూ.19 వేల కోట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సహకార బ్యాంకులు లాభాల బాటపట్టాయి. గతంలో కంటే టర్నోవర్‌లోనూ, లాభాల్లోనూ మేటిగా నిలబడ్డాయి. రైతులకు అధిక రుణాలిస్తూ ముందు వరుసలో ఉన్నాయి. ముఖ్యంగా డీసీసీబీలు, ప్యాక్స్‌లు క్షేత్రస్థాయిలో విభిన్న రంగాల్లో వ్యాపారాలు చేస్తూ లాభాలను గడిస్తున్నాయి. ఈ క్రమంలోనే తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ వార్షిక టర్నోవర్ భారీగా పెరిగింది. ఈ మేరకు మంగళవారం నివేదిక విడుదల చేసింది. 2015లో ఈ బ్యాంకు వార్షిక టర్నోవర్ కేవలం రూ. 6,307 కోట్లు మాత్రమే ఉండగా ప్రస్తుతం ఇది రూ. 19,021 కోట్లకు పెరిగింది. అంటే ఎనిమిదేళ్లలో టెస్కాబ్ టర్నోవర్ మూడు రెట్లు పెరగడం గమనార్హం. దీంతో పాటు లాభాలు కూడా అదే స్థాయిలో పెరిగాయి. 2015లో ఆ బ్యాంకు లాభాలు కేవలం రూ. 27.81 కోట్లు మాత్రమే కాగా, ప్రస్తుతం ఇది రూ. 133 కోట్లకు పెరిగింది. గతేడాది తొలిసారిగా రూ. 100 కోట్ల లాభాల మార్జిన్‌ను బ్యాంకు చేరుకుంది. టెస్కాబ్ ద్వారా రుణాల మంజూరు కూడా భారీగా పెరిగింది. 2015లో కేవలం రూ. 2,909 కోట్లు మాత్రమే రుణాలను అందించగా ప్రస్తుతం ఇది రూ. 8,508 కోట్లకు పెరిగింది. టెస్కాబ్, డీసీసీబీలు, ప్యాక్స్‌లు దేశంలో అనేక అవార్డులు సాధిస్తూ ప్రతిభ కనబరుస్తున్నాయి. దేశంలోని సహకార బ్యాంకుల్లో సాంకేతికత వినియోగాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిన తొలి రాష్ట్రంగా తెలంగాణ ఘనత సాధించింది. దీంతో పాటు సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్ సెంటర్‌ను నెలకొల్పిన తొలి సహకార బ్యాంకులు కూడా తెలంగాణ సహకార బ్యాంకులే కావడం గమనార్హం. అదే విధంగా అన్ని ప్రాథమిక సహకార సంఘాల (ప్యాక్స్)ను కంప్యూటరైజేషన్ చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. 2018–19లో 798 ప్యాక్స్‌లు ఉండగా ప్రస్తుతం వీటి సంఖ్య 825కి పెరిగింది.

### ఉత్తమ సేవలు అందిస్తున్నాం..

రైతులకు, వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. రైతులకు సరళ పద్ధతిలో రుణాలు మంజూరు చేస్తున్నాం. ప్యాక్స్‌ల ద్వారా ఇతర వ్యాపారాలు చేస్తూ వాటి లాభాలను మరింత పెంచాం. టెస్కాబ్, డీసీసీబీ, ప్యాక్స్ టర్నోవర్‌తో పాటు లాభాలు పెరిగాయి. ఇంకా బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. వాణిజ్య బ్యాంకులకు దీటుగా పనిచేస్తున్నాం.

– నేతి మురళీధర్‌రావు, ఎండీ, టెస్కాబ్



## తిరుమల పవిత్రోత్సవాలు పరిపూర్ణం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన పవిత్రోత్సవాలు మంగళవారం పూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం యాగశాలలో రుత్వికులు హోమాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం జరిపారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీరు, పసుపుతో అభిషేకించి చివరగా చందనం పూత పూశారు. ధూపదీప హారతులు నివేదించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించారు. ఆ తర్వాత శ్రీ మలయప్పస్వామి వారు శ్రీదేవి, భూదేవితో కలిసి విమాన ప్రదక్షిణంగా వెళ్లి ఆలయ ప్రవేశం చేయడంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఈవో ఏవీ ధర్మారెడ్డి దంపతులు, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.



## కాంట్రాక్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో వివిధ సబ్జెక్టులు బోధించేందుకు కాంట్రాక్టు విధానంలో లెక్చరర్లను నియమించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉమాదేవి తెలిపారు. బోటనీ, తెలుగు, మైక్రో బయాలజీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ బోధించేందుకు ఒక్కో పోస్టు, కామర్స్ బోధించేందుకు రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా సబ్జెక్టుల్లో పీజీ ఉత్తీర్ణులై, నెట్, సెట్ లేదా పీహెచ్‌డీ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు సెప్టెంబర్ 1న కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని, వివరాల కోసం 94910 63083 నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.


## గిరిజన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



పీఓకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏటీడీఓ

భద్రాచలం: గిరిజనుల విద్యార్థుల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. మహబూబాబాద్ ఏటీడీఓ సత్యవతి పీఓను భద్రాచలంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలోని గిరిజన సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల విషయమై శ్రద్ధ వహిస్తూ వారి అభ్యున్నతికి పాటుపడాలని సూచించారు.

## మహిళలకు ఆర్టీసీ ఆఫర్ !



ఖమ్మం మామిళ్లగూడెం: రాఖీపౌర్ణమి సందర్భంగా సోదరులకు రాఖీ కట్టేందుకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు సంస్థ ఆఫర్ ప్రకటించింది. ఈనెల 30, 31వ తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలు గమ్యస్థానానికి చేరాక టికెట్ వెనకాల పేరు, సెల్ నంబర్ రాసి బస్టాండ్‌లోని బాక్సుల్లో వేయాలి. అనంతరం రీజియన్ వారీగా సెప్టెంబర్ 9న డ్రా తీసి ముగ్గురు చొప్పున విజేతలను బహుమతులు అందజేయనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు.

# 'నివేదన' అర్చకుల్లో ఆనందం

- రూ.10 వేలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ
- అర్చకుల గౌరవ వేతనం రూ.6 వేలు, పడితరానికి రూ.4 వేలు
- ఉమ్మడి జిల్లాలో 415 ఆలయాలకు పథకం అమలు



ఖమ్మం కలెక్టరేట్ సమీపంలోని రామాలయం వద్ద అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: వెనకబడిన ఆలయాలు, వీటిని నిర్వహించే అర్చకుల ప్రయోజనం కోసం రూపొందించిన ధూప దీప నైవేద్య పథకం నిధులు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్‌లో నిర్మించిన విప్రహిత బ్రాహ్మణ సంక్షేమ భవనాన్ని మే 31న సీఎం కేసీఆర్ ప్రారంభించిన సందర్భంగా ధూప దీప నివేదన పథకం నిధులను రూ.10 వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. ఇందులో రూ.6వేలు అర్చకుడికి గౌరవ వేతనంగా, ధూప దీప నివేదనకు రూ.4వేలుగా నిర్ణయిస్తూ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ కమిషనర్ వి.అనిల్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### పథకానికి ఆద్యుడు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఉన్నప్పుడు ధూప దీప నివేదన పథకాన్ని ప్రారంభించారు. పురాతన ఆలయాల్లో నిత్యం పూజలు నిర్వహించడంతోపాటు అర్చకులకు లబ్ధి జరిగేలా 2007లో ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. తొలుత నెలకు రూ.2,500 చొప్పున అందించగా, శిథిలావస్థలోని ఆలయాలు కొంత మేర పూర్వ వైభవాన్ని సంతరించుకున్నాయి.

### ఉమ్మడి జిల్లాలో 415 ఆలయాలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ధూప దీప నైవేద్యం పథకం 415 ఆలయాలకు అమలవుతోంది. ఇందులో ఖమ్మం జిల్లాలో 305, భద్రాద్రి జిల్లాలో 110 ఆలయాలు ఉన్నాయి. తెలంగాణ ఏర్పడ్డాక ధూప దీప నైవేద్యం(పడితరం) పథకం చెల్లింపులను రూ.6 వేలకు పెంచారు. ప్రస్తుతం మరో రూ.4వేలు పెంచగా, రూ.10వేలకు చేరింది. ఇందులో ధూప దీప నివేదనకు రూ.4 వేలు, అర్చకుడి గౌరవ వేతనం రూ.6 వేలుగా అందుతుంది.

### ప్రోత్సాహకం అభినందనీయం



ధూప దీప నైవేద్యం పథకం నగదును ప్రభుత్వం రూ.10 వేలకు పెంచడం అభినందనీయం. ఈ పథకం ద్వారా పురాతన దేవాలయాలకు పూర్వ వైభవం వస్తోంది. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు. ముఖ్యమంత్రి చొరవతోనే ప్రోత్సాహకం పెరిగింది.

– మునగలేటి రమేష్‌శర్మ, డీడీఎన్ అర్చక సంఘం అధ్యక్షుడు, ఖమ్మం జిల్లా

### ఆలయాలకు ఆదరణ



ధూప దీప నివేదన పథకంతో ఆలయాలకు ఆదరణ పెరిగే అవకాశం ఉంది. నిత్యం ఆలయాల్లో దీపం వెలిగించటం, నివేదన సమర్పించటం వంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు. డీడీఎన్ పథకం నగదును రూ.10 వేలకు పెంచడం సంతోషంగా ఉంది.

– కలినపుడి అంజనీకుమార్‌శర్మ, డీడీఎన్ అర్చక సంఘం, భద్రాద్రి జిల్లా

# కమ్యూనిస్టుల సత్తా చాటుదాం..

- ఉద్యమాలు నిర్మించడంలో దిట్ట 'సిద్ది'
- విగ్రహావిష్కరణలో కూనంనేని, చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని, పక్కన వెంకటరెడ్డి, నాయకులు

పాల్వంచ: వచ్చే ఎన్నికల్లో కమ్యూనిస్టుల సత్తా ఏమిటో పాలకులకు చూపించేలా పనిచేస్తూనే... తెలంగాణలో ఎన్నికలను సవాల్‌ను తీసుకుంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. పాల్వంచ పాత ఆర్డీఓ కార్యాలయం రోడ్‌లో సీపీఐ రాష్ట్ర మాజీ సహాయ కార్యదర్శి, ఉమ్మడి జిల్లా కార్యదర్శి సిద్ది వెంకటేశ్వర్లు విగ్రహాన్ని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిస్టులను తమ అవసరాలకు వాడుకుంటున్నారని అన్నారు. ఈ నేపథ్యాన దేశం, రాష్ట్రాన్ని పీడించుకుతింటున్న శక్తులను ఓడించి ఎర్రజెండా సత్తా చాటేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఇప్పుడు పాలిస్తున్న పార్టీలు నీతి, నిజాయితీని పక్కన పెట్టిన స్వార్థపూరిత రాజకీయాలకు తెరలేపాయని ఆరోపించారు. చంద్రుడిపై అడుగిడితే దానికి కూడా దేవుడి పేరు పెట్టారని... ఈప్రయోగంలో అన్ని మతాలు, కులాల శాస్త్రవేత్తలు పాలు పంచుకోలేదా అని ప్రశ్నించారు. శాస్త్రీయతకు మతం రంగు పులుముతూ సైన్స్‌ను అవహేళన చేస్తున్నారని మండిపడ్డారు. కాగా, సిద్ది వెంకటేశ్వర్లు అనేక ప్రజా ఉద్యమాలు నిర్మించి పేదలకు న్యాయం చేశారని గుర్తు చేశారు. అనంతరం చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకలను నొక్కి ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేసే ప్రభుత్వాన్ని తిప్పి కొట్టాలని సూచించారు. మహబూబాబాద్, హనుమకొండ, మహబూబ్‌నగర్, పాల్వంచ తదితర ప్రాంతాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణాలకు సిద్ది వెంకటేశ్వర్లు కృషి మరువలేనిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం, భాగం హేమంతరావు, ఖమ్మం, భద్రాద్రి జిల్లా కార్యదర్శులు పోటు ప్రసాద్, ఎస్‌కే.సాబీర్ పాషాతో పాటు మహ్మద్ మౌలాన, రావులపల్లి రాంప్రసాద్, సురేశ్, సూర్యదేవర రామ్మోహన్‌రావు, కల్లూరి వెంకటేశ్వరరావు, లక్ష్మీకుమారి, సారయ్య, శ్రీనివాస రెడ్డి, శంకర్, చంద్రగిరి శ్రీనివాసరావు, సలీం, భాస్కర్ సిద్ది కుటుంబీకులు సరళకుమారి, భరత్ పాల్గొన్నారు.

## రామాలయానికి రెగ్యులర్ ఈఓగా రమాదేవి



బాధ్యతలు స్వీకరించిన ఈఓకు జ్ఞాపిక అందజేస్తున్న ఉద్యోగులు



నిత్యాన్నదాన దాతలకు రశీదు ఇస్తున్న ఇన్‌స్పెక్టర్

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా ఎల్.రమాదేవి మంగళవారం పూర్తి స్థాయి బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని దేవాదాయశాఖలో ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆమెను ఈ ఏడాది ఫిబ్రవరి 10వ తేదీన ఇన్‌చార్జ్ ఈఓగా నియమించారు. ఆమె హయాంలో శ్రీరామనవమి విజయవంతం కావడమే కాక భక్తులు వసతులను మెరుగుపర్చటం, ఆదాయ వనరులను పెంచడంతో పాటు ఆలయ పర్యవేక్షణను గాడిలో పెట్టడంతో రెగ్యులర్ ఈఓగా నియమిస్తూ ఈనెల 14వ తేదీన శాఖ కమిషనర్ అనిల్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో రమాదేవి మంగళవారం దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశాక బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అర్చకులు వేదాశీర్వచనం అందజేయగా, ఏఈఓలు శ్రవణ్‌కుమార్, భవాని రామకృష్ణ, డీఈ రవీందర్, సీసీ అనిల్ జ్ఞాపిక అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తూనే భక్తులకు మరిన్ని సేవలను అందించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు.

### కొనసాగుతున్న పవిత్రోత్సవాలు

రామాలయంలో పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం, సాయంత్రం హవనములను జరిపారు. కాగా ఈ ఉత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. అలాగే, హయగ్రీవ జయంతి సందర్భంగా గురువారం ప్రత్యేక స్నపనం, ఇతర పూజలు జరపనున్నట్లు వైదిక కమిటీ బాధ్యులు తెలిపారు.

### నిత్యాన్నదానానికి విరాళం

దేవస్థానం పరిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి ఏపీకి చెందిన భక్తులు విరాళం అందచేశారు. తిరుపతికి చెందిన రాఘవరాజు, విమల దంపతులు రూ.లక్ష డీడీని అధికారులకు అందజేయగా, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు చేయించారు.

# వాలాగ్ర పూజకు అనుమతి

- ఖమ్మం కాల్వొడ్డు ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రారంభం
- ప్రతి శనివారం నిర్వహణ



ఆంజనేయ స్వామి ఆలయంలో వాలాగ్ర పూజ చేస్తున్న అర్చకుడు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు శ్రీ సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి దేవస్థానంలో వాలాగ్ర పూజకు రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆలయంలో మంగళవారం ఈ పూజను ప్రారంభించారు. ఆంజనేయుడి వాలాగ్ర(తోక) పూజను తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే చేస్తున్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాలు, కృష్ణ, గుంటూరు జిల్లాల్లోని కొన్ని ఆలయాల్లో మాత్రమే ఈ పూజ నిర్వహిస్తారు. ఖమ్మం నగరంలో ప్రముఖ ఆంజనేయ స్వామి ఆలయంగా విరాజిల్లుతున్న కాల్వొడ్డు శ్రీ సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి దేవస్థానంలో వాలాగ్ర పూజకు అనుమతి లభించడం పట్ల ఆలయ నిర్వాహకులు, భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పూజ కోసం భక్తులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండగా, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ తీసుకున్న ఈ నిర్ణయంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు ఇక్కడే పూజ చేయించుకునే అవకాశం కలిగింది. వాలాగ్ర పూజతో విద్య, ఉద్యోగం, వ్యాపారం, కల్యాణం, గృహ నిర్మాణం వంటి అంశాల్లో సత్ఫలితాలు కలుగుతాయని అర్చకులు వివరించారు. ఇకపై ప్రతి శనివారం ఉదయం 9 గంటలకు కాల్వొడ్డు శ్రీ సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తామని, ఇందుకు రూ.101 ఫీజుగా నిర్ణయించామని, పూజాసామగ్రి భక్తులే తెచ్చుకోవాల్సి ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం నాటి పూజా కార్యక్రమంలో ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ బచ్చు మురళీకృష్ణ, ఈఓ వి.వి.నర్సింహారావు, అర్చకులు ఎస్బీ కృష్ణమాచార్యులు, ఫణిరాజాచార్యులు, నరసింహాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు జి.రవి, ఎం. శ్రీనివాసరావు, సిబ్బంది పి. బేబీ సరోజిని తదితరులు పాల్గొన్నారు.